క్లుప్తంగా

ఆలయం చుట్టూ షెడ్ నిర్మాణం



శంకుస్థాపన చేస్తున్న అర్చకులు

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షి తాయి ఆలయం చుట్టూ షెడ్ నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు మాట్లాడుతూ వేసవి కాలంతో పాటు వర్షా కాలంలో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా షెడ్ నిర్మాణం గురించి చెన్నైకు చెందిన దాతలు వల్లూరు రవీంద్రారెడ్డి-కామాక్షమ్మ దృష్టికి తీసుకెళ్లామన్నారు. వారు సానుకూలంగా స్పందించడంతో భక్తుల సౌకర్యార్థం షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. త్వరలో పనులు పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు పాల్గొన్నారు.

సుదర్శనస్వామికి అభిషేకం



పొదలకూరు : పట్టణంలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం గరుడ పంచమి సందర్భంగా సుదర్శనస్వామి, గరుడ అల్వార్‌కు అభిషేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ప్రశాంతంగా ఆలయ భూముల వేలం



ఈపూరులో వేలం నిర్వహిస్తున్న అధికారులు

ముత్తుకూరు : ముత్తుకూరు మండలం, ఈపూరులోని చెన్నకేశవస్వామి ఆలయ భూములకు సంబంధించి మూడు సంవత్సరాల కౌలు వేలం సోమవారం ప్రశాంతంగా జరిగింది. ఇందులో భాగంగా 19.44 ఎకరాల భూమి గతంలో రూ.1.42 లక్షలకు వేలంపాటలో రైతులు సొంతం చేసుకున్నారు. నాన్ అగ్రికల్చర్ ల్యాండ్ కింద ఇదే భూమి ప్రస్తుతం రూ.10.50 లక్షలకు వేలం పాడారు. ఇదే ఆలయానికి చెందిన మాగాణి 22.83 ఎకరాలు గతంలో రూ.3.08 లక్షలకు వేలం పాడారు. ఇప్పుడు రూ.3.36 లక్షలకు వేలంలో సొంతం చేసుకున్నారు. అలాగే, మెట్ట 77.07 ఎకరాలు గతంలో రూ.5.97 లక్షలకు వేలం పాడగా, ఇప్పుడు రూ.8.63 లక్షలకు వేలం పాడారు. ఈపూరులోని మరో ఆలయమైన విరూపాక్షేశ్వరస్వామి ఆలయానికి చెందిన మాగాణి భూములు 8.79 ఎకరాలు గతంలో రూ.84,000 వేలకు వేలం పాడగా, ఇప్పుడు రూ.85,500లకు పెంచుతూ వేలం పాడారు. ఆలయ ఈఓ దర్గయ్య, కోవూరు ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ చైతన్య, పూడిపర్తి ఈఓ రవీంద్రరెడ్డి, కృష్ణపట్నం ఈఓ జనార్దనరెడ్డి పాల్గొన్నారు.

వెంకయ్యస్వామికి ఆరాధనోత్సవాలు



వెంకయ్యస్వామి గ్రామోత్సవం

మనుబోలు : మనుబోలు-చెర్లోపల్లి మార్గంలో ఉన్న భగవాన్ శ్రీవెంకయ్యస్వామి ఆరాధన మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం వెంకయ్యస్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. తొలుత స్వామివారికి స్వస్తి పుణ్యాహవచనం, సహస్రనామార్చన, పంచామృతాభిషేకం చేసిన అనంతరం ప్రత్యేక పుష్పాలంకరణ చేసి ట్రాక్టర్‌లో కొలువుదీర్చి ఊరేగింపు గావించారు. ఆరాధనోత్సవాల్లో భాగంగా మంగళవారం నవగ్రహ శాంతి పూజ, కలశ ప్రతిష్ఠాపన, మహాగణపతి హోమం ఉంటుందని, బుధవారం అభిషేకాలు, శిఖరపూజ, పల్లకిసేవ, నిర్వహిస్తామని ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసులు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎంపీ ఆదాల

నెల్లూరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 19వ డివిజన్ ముత్యాలపాళెం, శ్రీహరినగర్, శ్రీవారినగర్ ప్రాంతాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఆయన సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వారికి అందిన సంక్షేమాన్ని వివరించి బుక్‌లెట్‌ను అందజేశారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా.. అని ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు స్థానిక సమస్యలపై ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధి ప్రజల ఆనందంలో తెలుస్తుందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రస్తుత ప్రభుత్వంలో వివిధ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందుతున్నాయన్నారు. ఏమైనా కారణాలతో అర్హత కలిగి ఉండి కూడా లబ్ధి అందకుండా ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయా ప్రాంతాల్లో ఎంపీ ఆదాల పర్యటిస్తున్న సమయాల్లో మహిళలు మంగళ హారతులిచ్చి స్వాగతం పలికారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంపీని గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, పచ్చా రవి, రఘురామిరెడ్డి, మత్రిపాడు జెడ్పీటీసీ సభ్యుడు మల్లు సుధాకర్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



ఆలయంలో ఏర్పాటు చేసిన నూతన ధ్వజస్తంభం

నెల్లూరు రూరల్ : రూరల్ పరిధిలోని నరసింహకొండపై కొలువైన శ్రీవేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ పూజలు సోమవారం ఉదయం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయ ప్రధాన అర్చకుడు భాస్కరాచార్యులు పర్యవేక్షణలో వేద పండితుల మంత్రోచ్ఛారణలు, గోవిందనామ స్మరణల మధ్య అత్యంత వైభవంగా కార్యక్రమం జరిగింది. భక్తులు బంగారు, వెండి ఆభరణాలు, డాలర్లు, పంచలోహాలు, నవరత్నాలను ధ్వజస్తంభ ప్రతిష్ఠ ప్రదేశంలో ఉంచారు. గరుడ పంచమి సందర్భంగా గరుత్మంతునికి ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలు నిర్వహించారు. నూతన ధ్వజస్తంభ దాత కాకాణి నరహరి రెడ్డి, ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, పాలకమండలి సభ్యులు పలు ప్రాంతాల భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

సకాలంలో పరిష్కారం చూపాలి



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ వికాస్‌మర్మత్

• అర్జీలు రీఓపెన్ కాకూడదు
• కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు) : 'స్పందన', 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాల ద్వారా ప్రజల నుంచి వచ్చే అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలని, అర్జీలు రీఓపెన్ కాకుండా చూసుకోవాలని కమిషనర్ వికాస్‌మర్మత్ అధికారులను ఆదేశించారు. నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోని ఏపీజే అబ్దుల్‌కలాం సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన స్పందన వేదికలో 'డయల్ యువర్ కమిషనర్' కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వచ్చిన 12 ఫోన్ కాల్స్‌ను ఆయన నేరుగా మాట్లాడారు. అనంతరం ప్రజల నుంచి 34 అర్జీలను స్వీకరించారు. ఆయా సమస్యలకు గడువులోపు పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా విజ్ఞప్తులపై క్షేత్రస్థాయిలో విచారించి, ఫిర్యాదులు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. టిడ్కో గృహాలకు సంబంధించి వస్తున్న అభ్యర్థులను పరిశీలించి వారందరికీ తగిన పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. సంబంధిత విభాగాల ఉన్నతాధికారుల అనుమతులతోనే స్పందన సమస్యలకు నాణ్యమైన పరిష్కారం అందించిన తరువాత ఫిర్యాదులను క్లోజ్ చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కార్యాలయంలోని అన్నివిభాగాల ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను కలిసిన ఎన్జీఓ నేతలు



నెల్లూరు (పొగతోట) : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని జిల్లా ఎన్జీఓ నాయకులు కలిశారు. ఏపీఎన్జీఓ 21వ రాష్ట్ర మహాసభలు విజయవాడలో సోమవారం జరిగాయి. సమావేశానికి హాజరైన సీఎం జగన్‌ను జిల్లా ఎన్జీఓ నేతలు పెంచలరావు, నాయుడు వెంకటస్వామినాయుడు కలిశారు.

వాలిన స్తంభానికి మరమ్మతులు



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని మైపాడు రోడ్డులోని మారుతీనగర్ ప్రాంతంలో ఓ విద్యుత్ స్తంభం వాలి ప్రమాదభరితంగా ఉండడంతో స్థానికులు సంబంధిత విద్యుత్ అధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో ఈస్ట్-1 విద్యుత్‌శాఖ ఏఈ విజయ్‌కుమార్ ఆదేశాలతో సిబ్బంది సోమవారం వాలిన విద్యుత్‌స్తంభానికి మరమ్మతులు చేసి యథా స్థానానికి తీసుకొచ్చారు.

వంట మనిషి పోస్టుకు దరఖాస్తు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని ఆటో నగర్‌లో ఉన్న మైనారిటీ బాలుర గురుకులంలో వంట మనిషి పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని గురుకుల ప్రిన్సిపల్ మురళీకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈనెల 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకువాలని కోరారు. ఇతర వివరాలకు 87126 25045 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వసతుల కల్పనకు వినతి



ఎంపీ ఆదాలను సత్కరిస్తున్న గ్రంథాలయ సభ్యులు

నెల్లూరు రూరల్ : నగరంలోని మద్రాసు బస్టాండ్ సమీపంలో ఉన్న గుర్రం జాషువా గ్రంథాలయం, ఇక్కడికి సమీపంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల హాస్టల్‌లో వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాల్సిందిగా గుర్రం జాషువా ప్రజా గ్రంథాలయ అధ్యక్షుడు ఖాసిం విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నగరంలోని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి నివాసంలో ఆయన్ను కలిసి సమస్యలను విన్నవించారు. గ్రంథాలయాన్ని, బాలికల హాస్టల్‌ను సందర్శించి అక్కడి సమస్యలను పరిష్కరిస్తామని, మౌలిక వసతులను పూర్తిస్థాయిలో సమకూరుస్తామని ఆదాల హామీ ఇచ్చారు. అనంతరం వారు ఎంపీని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణయ్య, జనార్దన్, కొండయ్య, రవీంద్రబాబు, పిచ్చయ్య, వెంకటేశ్వర్లు, కృష్ణయ్య, షాజహాన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం స్వర్ణకార సంఘ రాష్ట్రాధ్యక్షుడిగా ఇస్మాయిల్



ఇస్మాయిల్‌ను అభినందిస్తున్న స్వర్ణకారులు

నెల్లూరు(బృందావనం) : ఆంధ్రప్రదేశ్ ముస్లిం స్వర్ణకార సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా నెల్లూరుకు చెందిన షేక్.ఇస్మాయిల్ ఖాదిరి ఎన్నికయ్యారు. ఈ మేరకు నెల్లూరు నగరంలోని చిన్నబజారులో ఇస్మాయిల్‌కు అభినందన సభ సోమవారం రాత్రి జరిగింది. అనంతరం ఇస్మాయిల్ ఖాదిరి మాట్లాడుతూ రాష్ట్ర సంఘానికి సంబంధించి 26 జిల్లాల పరిధిలో 15 కేంద్రాల్లో ఆదివారం రాత్రి పోలింగ్ చేపట్టారన్నారు. ఇందులో పట్టకర్ర గుర్తుపై పోటీ చేసిన తమ ప్యానల్ ఘన విజయం సాధించిందన్నారు. దీంతో సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా తాను, ప్రకాశం జిల్లా సింగరాయకొండకు చెందిన సయ్యద్ అహ్మద్ బాషా, నంద్యాలకు చెందిన ఎండీ యాకుబ్ కోశాధికారిగా ఎన్నికైనట్లు తెలిపారు. తన వంతుగా రాష్ట్రంలో స్వర్ణకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం ఇస్మాయిల్‌ను స్వర్ణకారులు సన్మానించారు.

స్వచ్ఛంద సంస్థలు తోడ్పాటు అందించాలి

• రేపు పాటలు, నృత్య పోటీలు



మ్యూజికల్ నైట్ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం) : కళలను, కళాకారులను ప్రోత్సహించేందుకు స్వచ్ఛంద సంస్థలు తమ వంతు తోడ్పాటు అందించాలని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జయప్రకాష్ తెలిపారు. నెల్లూరు నగరంలో గాంధీబొమ్మ దగ్గర ఉన్న స్వతంత్ర పార్కులో ఏవీకే ఫౌండేషన్ అధ్యక్షుడు విజయకుమార్ సౌజన్యంతో కేతా అంకులు మెమోరియల్ ట్రస్టు అధ్యక్షుడు సుబ్బారావు పర్యవేక్షణలో ఆగస్టు 23న పురమందిరంలో జరుగనున్న పాటలు, నృత్య పోటీలు, మ్యూజికల్ నైట్‌కు సంబంధించిన ఆహ్వాన పత్రికలను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడారు. జిల్లాలో కళారంగానికి ఏవీకే ఫౌండేషన్, కేతా మెమోరియల్ ట్రస్ట్‌లు అందిస్తున్న సహకారం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమ నిర్వాహకుడు సుబ్బారావు మాట్లాడుతూ స్థానిక కళాకారుల ప్రతిభను ప్రోత్సహించేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. సంగీత విభావరిలో విజేతలుగా నిలిచిన వారికి ప్రోత్సాహక నగదు బహుమతితో పాటు జ్ఞాపికలు అందజేస్తామన్నారు. ఆసక్తి గల వారు 77299 42543 నంబర్‌కు సంప్రదించాలన్నారు. వివిధ రంగాలకు చెందిన ఉత్తమ సేవకులను సత్కరించనున్నట్లు వివరించారు. సమావేశంలో డ్యాన్స్ మాస్టర్ ఎన్వీ రమణయ్య పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



కలెక్టర్‌ను కలిసిన విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు

నెల్లూరు(దర్గామిట్ట) : జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కలెక్టర్ ఎం.హరినారాయణన్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. త్వరలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తెలిపినట్లు డీడీ రమేష్ తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో కమిటీ సభ్యులు పోలవరపు సుబ్బారాయుడు, వట్టికల బాలయ్య, శేషం సుదర్శన్, డి.ప్రసన్న గణపతి, శీనయ్యలతో పాటు సోషల్‌వెల్ఫేర్ డీడీ రమేష్ ఉన్నారు.

ఎంపీ ఆదాలకు సత్కారం



ఆదాల, విజయకుమార్‌రెడ్డిలను సత్కరిస్తున్న ముస్లిం నేతలు

నెల్లూరు రూరల్ : నగరంలోని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ఆయన నివాసంలో పలువురు ముస్లిం మైనారిటీ నేతలు సోమవారం రాత్రి ఘనంగా సత్కరించారు. ఇటీవల బారాషహీద్ దర్గాలో నిర్వహించిన రొట్టెల పండగ విజయవంతానికి ఎంపీ ఆదాల అందించిన సహకారానికి వారు ఆయన్ను అభినందించారు. దీంతో పాటు డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డిని కూడా వారు అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో ఇస్మాయిల్ ఖాదరీ, పలువురు ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

డివిడెండ్ చెల్లించండి



వినతి పత్రం సమర్పిస్తున్న సభ్యులు

నెల్లూరు(మినీబైపాస్) : పోస్టల్, టెలికాం సొసైటీలోని సమస్యలను పరిష్కరించాలని సొసైటీ పరిరక్షణ సమితి చైర్మన్ ఏవీ కృష్ణయ్య, కన్వీనర్ సీహెచ్ వెంకయ్య, వైస్ చైర్మన్ బి.ఆంజనేయులు సోమవారం డీసీఓ బి.సుధాభారతిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొసైటీలో వందలాది మంది పోస్టల్, టెలికాం, జీడీఎస్ సభ్యులు ఎదురు చూస్తున్న డివిడెండ్‌ను వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో పోస్టల్, టెలికామ్, జీడీఎస్, సొసైటీ నేతలు ఎం.నాగరాజు, భాస్కర్‌రెడ్డి, దుడ్డు రమేష్‌బాబు, ఎస్.వెంకటేశ్వర్లు, బి.ఆంజనేయులు, వెంకటరెడ్డి, సుధాకర్‌రావు పాల్గొన్నారు.

వాహనాల వేలం వాయిదా

పొదలకూరు : సెబ్ అధికారులు స్వాధీనం చేసుకున్న ఆటో, మోటార్‌బైక్‌లకు స్థానిక పోలీస్‌స్టేషన్లో వేలంపాటలు సోమవారం నిర్వహించాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల వాయిదా పడినట్లు ఎస్సై ఎస్‌కే కరిముల్లా ఒక ప్రకటనలో తెలియజేశారు. తిరిగి ఎప్పుడు వేలం నిర్వహించేది ముందుగా ప్రకటిస్తామన్నారు.

వినతుల స్వీకరణ

పొదలకూరు : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ కె.వీరవసంతరావు ఆధ్వర్యంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన వారి నుంచి సోమవారం వినతిపత్రాలను స్వీకరించారు. పట్టాదారు పాసుపుస్తకాలు, భూ వివాదాలు, అసైన్‌మెంట్ భూములు తదితర సమస్యలకు సంబంధించి రైతులు అర్జీలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నగేష్‌కుమారి, ఇతర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పంటల సాగుపై సూచనలు

పొదలకూరు : మండలంలోని మత్రిపల్లి రైతుభరోసా కేంద్రంలో జిల్లా వనరుల కేంద్రం నుంచి వచ్చిన వ్యవసాయ సహాయ సంచాలకులు సోమవారం పంటల సాగుపై సలహా మండలి సభ్యులకు పలు సలహాలు, సూచనలు చేశారు. వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే ప్రత్యామ్నాయ పంటల సాగు చేయాల్సిందిగా సూచించారు. పంటల సస్యరక్షణ, సాగులో ఆధునిక పోకడలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఏలు జి.లక్ష్మీమాధవి, కె.శివనాయక్, ఏఓ వాసు, వ్యవసాయాధికారి జి.మధురిమ, శాస్త్రవేత్త నాగమణి, రైతులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ రమాదేవి

కొడవలూరు : బాల్య వివాహాలను అరికట్టేందుకు అధికారులమంతా సమష్టిగా కృషి చేద్దామని తహసీల్దార్ ఈ.రమాదేవి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల బాల్య వివాహాల నిరోధక కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల తలెత్తే ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించడం ద్వారా వాటిని నివారించవచ్చన్నారు. ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 18 సంవత్సరాల్లోపు యువతీ యువకులు వివాహం చేసుకుంటే సెక్షన్-9 కింద నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే వెంటనే మహిళా పోలీసు లేదా పంచాయతీ కార్యదర్శి లేదా ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లకు సమాచారం అందించాలని కోరారు. ఏసీడీపీఓ అరుణకుమారి మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. సమావేశంలో ఎంఈఓ జి.వసంతకుమారి, ఎస్సై జి.సుబ్బారావు, ఏఓ లక్ష్మి, ఏపీఎం రుక్మిణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు టి.నాగభూషణమ్మ తదితరులు పాల్గొన్నారు.